ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025 5

శ్రీ సత్యసాయి

ఉపాధ్యాయ ఉద్యమ నేత

సికె.నాగేంద్ర బాబు కన్నుమూత

◆ ఉద్యోగ,ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నివాళి

◆ అనంతలో ముగిసిన అంత్యక్రియలు

సికె.నాగేంద్రబాబు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయ ఉద్యమ నేత, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర పూర్వపు కార్యదర్శి, ఉమ్మడి అనంతపురం జిల్లా సీనియర్ నేత సికె.నాగేంద్ర బాబు(70) తుదిశ్వాస విడి చారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అనంతపురం ప్రజాశక్తి కాలనీలోని తన స్వగృహంలో శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూశారు. నాగేంద్రబాబు మృతి విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లాకు చెందిన యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన నివాసం వద్దకు వచ్చి నివాళులు అర్పించారు. నాగేంద్రబాబు పార్థివ దేహంపై యుటిఎఫ్ జెండాను కప్పి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. యుటిఎఫ్, ఎపిటిఎఫ్, ఎస్‌టియు, వైఎస్ఆర్‌టియు, జెవివి, డిమైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఇతర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, పాత తరం నేతలు హాజరై సికె.నాగేంద్రబాబు పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. శనివారం సాయంత్రం అనంతపురం నగరంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రభుత్వ విద్య, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

ఉపాధ్యాయుడిగా, యుటిఎఫ్ నాయకుడిగా విద్యా రంగం సమస్యల పరిష్కారంలో నాగేంద్రబాబు ముందుండి పోరాడారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో జరిగిన ఉపాధ్యాయ ఉద్యమాల్లో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. యుటిఎఫ్ ఉమ్మడి అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడి, జిల్లా కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా సేవలు అందించారు. 2021 జూలై 31న ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఆరోగ్యంగా ఉన్నన్ని రోజులూ యుటిఎఫ్ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని తనవంతు సేవలు అందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నాగేంద్రబాబు సేవలు చిరస్మరణీయం

ప్రభుత్వ పాఠశాలల సంక్షేమం, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై సికె.నాగేంద్రబాబు చేసిన పోరాటాలు చిరస్మరణీయం అని పలువురు యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, అనంతపురం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, సుధాకర్, అధ్యక్షులు గోవిందరాజులు, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి కోటేశ్వరప్ప, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, జిల్లా నాయకులు రామప్ప, సుబ్బరాయుడు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి తన జీవితకాలం నాగేంద్రబాబు కృషి చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల్లో సామాజిక దక్పథాన్ని పెంచడానికి, అభ్యుదయ భావజాలాన్ని పెంచడానికి కషి చేశారని కొనియాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు నాయుడు, నాగరాజు, హెంద్రీ, బికె.నారాయణ, రఘు కృష్ణయ్య, జెవివి నాయకులు డాక్టర్ ప్రసూన, భాస్కర్, రామిరెడ్డి, శ్రీనివాసరావు, ఐద్వా రామాంజినమ్మ, ప్రజా సంఘాల నాయకులు విజయ భాస్కర్, లక్ష్మీనారాయణ, గోవింద్ రెడ్డి, రమణారెడ్డి, రామాంజనేయులు, సూర్యుడు, సురేష్, ఓబుళపతి, రామాంజనేయులు, రాజశేఖర్, నారాయణ తదితరులు నివాళులు అర్పించారు.

మా మాట వినడం లేదు..!

◆ ఇలాగైతే స్థానిక సంస్థల్లో ఇబ్బందులు తప్పవేమో

◆ ఇన్‌ఛార్జి మంత్రి ఎదుట అధికార పార్టీ నేతల మొర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'అధికారం వచ్చింది గానీ.. మా మాటెవరూ వినడం లేదు... ఏ పనులూ సాగడం లేదు. ఇలాగైతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవు'.. అని అధికార పార్టీ ముఖ్య నేతల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. ఈ అసంతృప్తిని ఇటీవల అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎదుట కూడా వెల్లగక్కినట్టు సమాచారం. ఇటీవల జిల్లాకు వచ్చి సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా నేతలంతా కలసి ఆయన దృష్టికి కొన్ని సమస్యలను తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. అధికారమెచ్చింది తమకు ఏదైనా చేయాలని కార్యకర్తలు అడుగుతున్నారని నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏదైనా చేద్దామంటే అధికారులు స్పందించే పరిస్థితులు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో క్షేత్ర స్థాయిలో పనిచేయాలంటే ఇబ్బందులు తప్పడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాబోయేది స్థానిక సంస్థల ఎన్నికల సమయమని కూడా చెప్పారు. వచ్చే ఏడాది మొత్తం అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశముంది. ఇటువంటి సమయంలో కార్యకర్తలకు పనిచేయకపోతే సమస్య వస్తుందని విచారం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా రేషన్ దుకాణాలకు సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం మారాక ముందున్న డీలర్లను తొలగించడమైతే జరిగింది. కాని వాటిని పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదు. ఏడాదిగా అవి చాలా వరకు తాత్కాలికంగానే నడుస్తున్నాయి. దీని వల్ల కొన్ని సమస్యలొస్తున్నాయి. ఫలితంగా క్షేత్ర స్థాయి నుంచి ఒత్తిళ్లు ఉంటున్నాయి. నేతలు వాటిని సర్దిచెప్పడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇవి కాకుండా కొన్ని రెవెన్యూ పరమైన సమస్యలుంటున్నాయి. వాటిని అధికారుల దృష్టికి పదేపదే తీసుకెళుతున్నా చర్యలుండటం లేదని కొన్ని నియోజకవర్గాల నేతలు నిర్దిష్టమైన ఫిర్యాదులను మంత్రికి తెలియజేశారు. అన్యాక్రాంతమైన భూముల వివరాలతోపాటు నిర్దిష్టంగా ఇచ్చినా చర్యలుండటం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. గతంలో తాము ప్రతిపక్షంలో ఉండగా ఒక్క ఫిర్యాదు అందుతూనే వెంట వెంటనే చర్యలుండేవని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. పోలీసు పరమైన చర్యల్లోనూ ఇదే తీరు కనబడుతోందని అభిప్రాయాన్ని వెలుబుచ్చారు. పనులకు బిల్లుల చెల్లింపుల్లోనూ కొంత జాప్యం ఉంటోందని చెప్పారు. ఇలా అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు కూడా తమ అభ్యర్థనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఒకేసారి నేతలంతా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. నేతలందరితో మాట్లాడక అధికారులతోనూ ప్రత్యేకంగా చర్చించినట్టు తెలుస్తోంది. తమ పరిధిలో అయ్యే పనులను వెంటనే చేసేయ్యాలని సూచించినట్టు తెలుస్తోంది. చేయలేనివి ఏమైనా ఉంటే పై స్థాయికి తీసుకుపోవాలని కూడా సూచించినట్టు సమాచారం.

పారిశ్రామిక వాడలో నిబంధనలకు పాతర..!

పరిశ్రమలకు కేటాయించిన స్థలంలో వాణిజ్య సముదాయాలు - ఏపీఐఐసీ ఆదాయానికి గండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండలం తూముకుంట పారిశ్రామిక వాడలో ఏపీఐఐసీ నిబంధనలకు పాతర వేశారు. పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య భవన సముదాయాలు నిర్మించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాణిజ్య భవన సముదాయాలు నిర్మించాలంటే నిబంధన మేరకు రెట్టింపు డబ్బు చెల్లించి వాణిజ్యపరంగా భూములను నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. పారిశ్రామిక వాడలో ఇలాంటివేవి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఏపీఐఐసీలో గతంలో పనిచేసిన కొందరు వాణిజ్య సముదాయాలను నిర్మించి అద్దెలకు ఇచ్చారు. గతంలో ఏపీఐఐసీలో పనిచేసిన ఆ వ్యక్తే ప్రస్తుతం ఆ వాణిజ్య భవన సముదాయాల్లో మద్యం దుకాణం నిర్వహిస్తుండడం గమనార్హం. పారిశ్రామిక వాడలో మద్యం షాపు పెట్టడం బాధాకరమని కార్మిక సంఘాలు, పరిశ్రమల యజమానులు చెబుతున్నా పట్టించుకునే పరిస్థితి ఉండడం లేదు. సంబంధిత మద్యం దుకాణం గార్మెంట్స్ పరిశ్రమలకు వందల మీటర్ల లోపే ఉంది. ఉదయం, సాయంత్రం మహిళా కార్మికులు ఆ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారని, ఆ సమయంలో మద్యం మత్తులో రోడ్డుపై నిలబడి తమను వేధిస్తున్నట్లు పలువురు మహిళా కార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వ అధికారులు ఈ మద్యం షాపును తొలగించాలని, అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య భవన సముదాయాలు నిర్మించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, కార్మిక సంఘాలు, పరిశ్రమల యజమానులు కోరుతున్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మడకశిర డిపోను మోడల్‌గా తీర్చిదిద్దుతాం - రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న ఉద్ధేశంత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రోడ్డు, రవాణా, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలియజేశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో కలిసి పాల్గొన్నారు. మడకశిరలోని క్రీడా సముదాయాన్ని పరిశీలించారు. మడకశిర డిపో నుంచి కదిరి - అనంతపురం వయా ముదిగుబ్బ, బత్తలపల్లి, కదిరి-రాయచోటి వయా గాండ్లపెంట, ఎస్పి.కుంట బస్సు సర్వీసులను ప్రారంభించారు. అంబేద్కర్ సర్కిల్‌లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ నూతన విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ముందుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి నీరుగారిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ వైఫల్యాలను చక్కదిద్ది ప్రభుత్వ శాఖలను గాడిలో పెడుతోందన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలియజేశారు. మడకశిర డిపో అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయక సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో రూ.15వేల కోట్లతో అతి పెద్ద సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పిపిటిఒ మధుసూదన్, మడకశిర డిపో మేనేజర్ శ్రీకాంత్, డిపో మేనేజర్ సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మడకశిరలో నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభించి డప్పు వాయిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే.

రికార్డులను పరిశీలన చేసి వైద్య ఆరోగ్య సిబ్బంది సమీక్షిస్తున్న డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ మంజువాణి

సమయపాలన పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

వైద్య ఆరోగ్య సిబ్బంది సకాలంలో ఆరోగ్య కేంద్రానికి రాకుంటే చర్యలు తీసుకుంటామని పెనుకొండ డివిజన్ డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మంజువాణి హెచ్చరించారు. శనివారం స్థానిక బసవనపల్లి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ముందుగా హాజరు పట్టికను పరిశీలించి సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. వేసవిలో ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆయుర్వేదిక్ క్లీనిక్ విభాగాన్ని పరిశీలించి ఆయూష్ వైద్యధికారిణి షకీలాబానుతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జయంత్ నాయక్, షకీలాబాను, సూపర్ వైజర్ ఈశ్వరమ్మ, ఇనాయత్, నరసింహులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత సాధిస్తే ఉచిత విద్యను అందిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు మే 1,2,3వ తేదిల్లో శ్రీ చిన్మయ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత విద్యను అందిస్తామని ట్రస్టు డైరెక్టర్, శ్రీ చిన్మయ కోచింగ్ సెంటర్ నిర్వహకులు వెంకట్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్‌డిటి సంస్థ ఎంపిక చేసి ఆ విద్యార్థులకు ఇంటర్ విద్యకు సహాయాన్ని అందించే వారు. ఈ విద్యా సంవత్సరం అనివార్య కారణాలతో ఆర్డీటీ ఆ సదుపాయాన్ని నిలిపేసింది. ఆర్‌డిటి చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని తమ ట్రస్టు తరపున ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. టాలెంట్ పరీక్షలను పట్టణంలోని సువర్ణ భారతీ జూనియర్ కళాశాలలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. టాలెంట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 10వ తరగతి మార్కు కార్డుతో పాటు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 7013721155, 7416054685 సంప్రదించాలని కోరారు.

పుట్టపర్తిలో నీటి సమస్య తలెత్తకూడదు : ఎమ్మెల్యే

మున్సిపల్ కమిషనర్ తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

వేసవిలో మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శిం చారు. పెద్దకమ్మవారిపల్లి, నాగులకట్ట, శిల్పారామం కాలనీ, తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యపై అనేక ఫిర్యాదులు అందాయన్నారు. తాగునీటి సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని కమిషనర్ ప్రహ్లాదపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సొమ్ముతో వేతనం తీసుకుం టున్న అధికారులు చాలా బాధ్యతగా పని చేయాలన్నారు. మోటార్లు ఆదనంగా ఏర్పాటు చేసుకుని



మున్సిపల్ అధికారులను హెచ్చరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ఇకపై పుట్టపర్తిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శిల్పారామం కాలనీలో కొత్తబోరు వేసి 3 నెలలైనా మోటారు, పైపులు, విద్యుత్ సరఫరా ఇవ్వకపోవడంతో నిరుప యోగంగా ఉందని తెలపడంతో ఎమ్మెల్యే ఫోన్ చేసి విద్యుత్ అధికారులతో మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే పుట్టపర్తి ప్రధాన నగర వీధులతో పాటు కాలనీల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పట్టణాన్ని పరిశు భ్రంగా తీర్చిదిద్దాలని కమిషనర్‌కు సూచించారు. పనితీరు మార్చుకోవాలని లేనిచో చర్యలు తప్పవని కమిషనర్‌ను మందలించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు గంగన్న, బెస్త చలపతి, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, రామారావు, సామకోటి ఆదినారాయణ, అంబులెన్స్ రమేష్, కృష్ణప్రసాద్, శు భాచంద్ర, అధికారులు ఉన్నారు.

వీరాపురంలో చెట్టుపై ఉన్న సైబీరియన్ పక్షులను పరిశీలిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

వీరాపురం కొంగల రక్షణకు చర్యలు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని వీరాపురం-వెంకటాపురం చెరువులు అరుదైన సైబీరియన్ పక్షులకు విడిదిగా ఉన్నాయని, ఈ పక్షుల రక్షణకు అన్ని చర్యలూ తీసుకుంటామని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. సైబీరియన్ పక్షులు ఉండే వీరాపురం,వెంకటాపురం చెరువులను కలెక్టర్ శనివారంసందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర సైబీరియా ప్రాంతాల నుంచి ప్రతి ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు పక్షులు వీరాపురం, వెంకటాపురం చెరువుల్లోకి వస్తుంటాయన్నారు. ఈ విలువైన పక్షులను సంరక్షిస్తూ, వీరాపురాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల్లో నీటి నిల్వ పెంపు, పూడికతీత పనులు, మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. పర్యాటకులకు వసతి సదుపాయాలు, వాచ్ టవర్ల ఏర్పాటునూ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి, పెనుకొండ అటవీ క్షేత్రాధికారి శ్రీనివాసులు రెడ్డి, చిలమత్తూరు తహశీల్దార్ వెంకటేష్, వీరాపురం సర్పంచి లక్ష్మీపతి రెడ్డి పాల్గొన్నారు.

డిఐఈవోగా సయ్యద్ మౌలా

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా నూతన డిఐఈఓగా సయ్యద్‌మౌలా శనివారం స్థానిక డిఐఈవో కార్యాలయంలో బాధ్య తలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ జిల్లాకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతో జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేస్తామన్నారు. కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి, రాష్ట్ర లెక్చరర్ సంఘం అధ్యక్షురాలు రవి, కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్లత, లెక్చరర్లు రామకృష్ణారెడ్డి, నాగభూషణ్, గీత, రమేష్‌రెడ్డి, నాగరాజు, సునీత, పాల్గొన్నారు.

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కరువు పీడిత ప్రాంతాల్లో ఆర్‌డిటి సంస్థ ప్రజలకు అందిస్తున్న సేవలకు అంతరాయం కలిగేలా కేంద్రం అడ్డుకోవడం సరైంది కాదని, వెంటనే ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం పట్టణంలో మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ 1969 నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల కోసం నిస్వార్థంగా సేవలు అందిస్తోందన్నారు. గృహ నిర్మాణాలు, పాఠశాలలు, వైద్య సేవలు, క్రీడా కార్యక్రమాల ద్వారా పేదల అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాకుండా వెనుకబడిన రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లో సైతం సేవలందిస్తుందన్నారు. ఈ సేవలన్నీ విదేశీ నిధులతోనే చేపడుతోందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని లేనిచో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

పుట్టపర్తిలో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

డీజీపీ ఆదేశాల మేరకు ఎస్పీ వి.రత్న శనివారం డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులుతో కలిసి ప్రశాంతి నిలయంలోని ప్రముఖ ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తానీయులు భారత దేశంలో ఉండకూడదని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ తరుణంలో బయటి ప్రాంతాల వచ్చి ఇక్కడ దుకాణాలు నిర్వహిస్తున్న వారిని తనిఖీ చేశారు. కాశ్మీర్ పౌరుల ముసుగులో ఇక్కడ పాకిస్తానీలు ఉండవచ్చు అనే సందేహంతో భారతదేశ పౌరుల రక్షణార్థం ఈ తనిఖీలు చేపట్టారు. శాంతిభవన్, గణేష్ గేట్, షాపింగ్ మాల్, సాయి కుల్వంత్ మందిరంతో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్, లాడ్జీలను తనిఖీలు చేశారు. ఎవరైనా పాకిస్థానీయులు జిల్లాలో ఉంటే తిరిగి వారి దేశానికి వెళ్లిపోవాలని ఎస్పీ ఆదేశించారు. వారి వెంట సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతి నిలయంలో తనిఖీలు చేస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు

ధర్మవరం రూరల్ : ఉగ్రదాడి నేపథ్యంలో శనివారం పట్టణంలోని లాడ్జిలను సిఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. సిఐలు మాట్లాడుతూ లాడ్జికి వచ్చే వారి వివరాలను పూర్తిగా తెలుసుకొని రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అనుమానం వస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

కలప అక్రమంగా తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

అనుమతులు లేకుండా అక్రమంగా కలపను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో సువర్ణ హెచ్చరించారు. స్థానిక ధర్మవరం రోడ్డు పక్కన అక్రమంగా కలప నిల్వ ఉంచగా శనివారం ఆర్డీవో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల అనుమతులు లేకుండా రోడ్డు పక్కనే కలపను నిల్వ ఉంచి వ్యాపారం కొనసాగించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చని చెట్లని నరికి అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న వారిపై తక్షణమే అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడ వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ నీలకంఠారెడ్డి, వీఆర్వో నజీర్, విఆర్ఎలు శివ, సాయి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

లబ్ధిదారులకు టిడ్కో గృహాలు కేటాయించాలి : సిపిఎం ఆధ్వర్యంలో రిలే దీక్ష

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం తక్షణమే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, లబ్ధిదారులకు టిడ్కో గృహాలు కేటాయించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్.నరసింహులు మాట్లాడుతూ పేదలకు పట్టణంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలోనీ అమీన్‌నగర్, న్యూఅమీన్ నగర్, కుమ్మరవాండ్లపల్లి ప్రాంతాల్లోని నిరుపేదలు సచివాలయం, తహశీల్దార్ కార్యాలయాల్లో వ్యక్తిగత అర్జీలు ఇచ్చి రెండు నెలలైనా అధికారులు స్పందించలేదన్నారు. అలాగే పట్టణంలో 2014-19 మధ్య కాలంలో గత టిడిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల కోసం దాదాపు 2 వేల మంది పేదలు రూ. 25 వేలు, రూ. 50 వేల చొప్పున డబ్బులు చెల్లించారన్నారు. అయితే వారికి ఇళ్లు కేటాయించకుండానే ఇంటి మీద అప్పు ఉందంటూ బ్యాంకులు డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం పట్టణ, గ్రామీణ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఆగిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. లేనిచో జిల్లా వ్యాప్తంగా పేదలతో కలిసి మే 5వ తేదీ కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. దీక్షలో సిపిఎం నాయకులు సాంబశివ, బాబ్‌జాన్, ముస్తాక్, జగన్మోహన్, శాంతిభాయి, రామ్మోహన్, నారాయణ, రఫీ, ఉదయ్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో రిలే దీక్షలో పాల్గొన్న సిపిఎం నాయకులు

నిరహారదీక్షలకు సిద్ధం : కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

హిందూపురం : రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సిపిఎం కాలనీలో ఇళ్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు వెంటనే ఇంటి పట్టాలను మంజూరు చేయడంతో పాటు, కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో రిలే దీక్షలను చేపట్టారు. అంతకుమునుపు లబ్ధిదారులు తహశీల్దార్ కార్యాలయం ముందు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ వెంకటేశుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిసెస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ హిందూపురం పట్టణ సమీపంలోని సిపిఎం ఆధ్వర్యంలో కొల్లకుంట సమీపంలో సొంతిల్లు లేని నిరుపేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నారని చెప్పారు. వీరందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. పేదలకు పట్టాలు ఇవ్వాలని హైకోర్టుకు కూడా చెప్పిందన్నారు. వెంటనే హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. లేనిపక్షంలో పేదలతో కలిసి నిరహార దీక్షలను చేపడుతామన్నారు. ఈ దీక్షల్లో కెవిపిఎస్ నాయకులు, ఇంటి పట్టాల పోరాట సమితి నాయకులు సంజీవ రాయుడు, రామాంజి, సరస్వతి, అంజలి, సునీత, రత్నమ్మ, గంగమ్మ, చంద్రమ్మ, అంబేద్కర్, మారుతి పాల్గొన్నారు.

హిందూపురంలో తహశీల్దార్ కార్యాలయం ముందు మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, లబ్ధిదారులు

ఒంటి కాలిపై నిల్చొని వినూత్న నిరసన

చిలమత్తూరు : పేదల ఇళ్ల స్థలాల కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఇందులో భాగంగా శనివారం నిరసనకారులు ఒంటికాలిపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి అంగన్వాడీ కార్యకర్తలు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పేదలు రెండున్నరేళ్ల నుంచి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న వారికి డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్, ఎస్ఐ మునీర్‌అహ్మద్, వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేయించారు. కార్యక్రమంలో వెంకటేష్, రామచంద్ర, భూమారెడ్డి, ఇళ్ల స్థలాల పోరాట సాధన సమితి నాయకులు నరసింహ, సదాశివరెడ్డి, నాగరాజు, అశ్వత్థరెడ్డి, వేణుగోపాల్, రహంతుల్లా, రామంజి, నారాయణప్ప, రజియాభాను, గోపాలప్ప, నరసింహప్ప, అలివేలమ్మ, సరస్వతమ్మ, అంజి, నాగమణి, సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సౌర వెలుగులు.. రైతుల జీవితాల్లో చీకట్లు..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సౌర వెలుగులు రైతుల జీవితాల్లో చీకట్లు నింపునున్నాయా అన్న ఆందోళన సర్వత్రా నెలకొంటోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్దఎత్తున సౌర విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిస్తూపోతోంది. ఈ వారంలోనూ రెండు ప్రాంతాల్లో అతి పెద్ద సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అనుమతిలిస్తూ ఉత్తర్వులిచ్చింది. గుత్తి, పామిడి ప్రాంతాల్లో 500 మెగావాట్లకుపైగా అనుమతులిచ్చింది. మడకశిరలో 2000 మెగావాట్లకుపైగా అనుమతిలిచ్చింది. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలంటే సగటున నాలుగు నుంచి ఐదు ఎకరాల భూమి అయినా అవసరమవనుంది. ఈ రెండు ప్రాజెక్టులకు కలిపి సుమారు 12 వేల ఎకరాల వరకు భూమిని తీసుకునే అవకాశముంది. ఇవి కాకుండా అంతకు మునుపు ఇచ్చిన అనుమతులు పెద్దఎత్తున ఉండటం గమనార్హం. బెళుగుప్ప మండలంలో 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అనుమతులిచ్చియున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, రాప్తాడు, కదిరి ప్రాంతాల్లోనూ వేలాది మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల అనుమతులిచ్చారు. ఈ ప్రాంతాలన్నింటిలోనూ పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే దాదాపు లక్ష ఎకరాలకుపైగా భూమిని వినియోగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కరువు ప్రాంతంలో ఇంత పెద్దఎత్తున భూములను రైతుల నుంచి సేకరించి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆయా గ్రామాల పరిధిలో వ్యవసాయం మీద ఆధారపడి పంటలు సాగు చేసే రైతులు, వాటిపై ఆధారపడిన వ్యవసాయ కూలీల పరిస్థితులు ఏరకంగా ఉండనున్నాయన్న ఆందోళన నెలకొంది. ఏడాదికి కంపెనీలిచ్చే రూ.31 వేల లీజుతో తక్కిన సరిపోతుందా లేదా అన్నది సందేహాస్పదంగా ఉంది. భూములు అందుబాటులో లేకపోతే ఆ ప్రాంతాల్లోని ప్రజల జీవన పరిస్థితులేమిటన్నది తెలియడం లేదు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉపాధి కూడా అనుకున్నంత లభించే అవకాశముండదు. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతాలవాసులు శాశ్వత వలసలు తప్పవా అన్న ఆందోళనలూ ఉన్నాయి. ప్రభుత్వం మాత్రం పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నట్లు చెబుతోంది. ఈ పెట్టుబడులు కంపెనీలకు లాభాలు చేకూరుస్తాయి తప్ప సామాన్య ప్రజలకు చేకూరే ప్రయోజనం ఏమీ ఉండదన్న విమర్శలూ ఉన్నాయి.

ఈ వారంలో వాతావరణం తిరిగి వేడి పుంజుకుంది. అంతకు మునుపు వర్షాలతో కొంత చల్లబడినట్లు కనిపించినా ఇప్పుడు తిరిగి పెరిగింది. దీంతో ఉక్కపోతలతో జనానికి ఇక్కట్లు తప్పడం లేదు. విద్యుత్ అంతరాయాలు వేధిస్తున్నాయి. ఇక అక్కడక్కడ తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. ప్రజల వాటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటిని అందించే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు ప్రభుత్వం వేతనాలివ్వలేదు. దీంతో ఆ కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. ప్రతిసారీ సమ్మెల ద్వారానే కార్మికులు వేతనాలు పొందాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనికి శాశ్వత పరిష్కార చర్యలేవీ ప్రభుత్వం తీసుకునే పరిస్థితుల్లేకపోవడం గమనార్హం.

సిపిఎం కాలనీకి నీరిస్తాం : తహశీల్దార్

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం క్రాస్‌లో ఏర్పాటైన సిపిఎం కాలనీలో నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకుకు తాగునీరు సరఫరా చేస్తామని తహశీల్దార్ మారుతి తెలిపారు. తాగునీటి కోసం శుక్రవారం కాలనీవాసులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో శనివారం తహశీల్దార్ మారుతి సిపిఎం కాలనీకి వెళ్లి నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకును పరిశీలించారు. దానికి అవసరమైన మరమ్మతులు, పైప్ లైన్ కనెక్షన్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి తప్పకుండా నీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. తహశీల్దార్ వెంట తలారి బాబు, వ్యాకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, నాగభూషణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ నాయకులు అంజనాదేవి, ఆంజనేయులు, వెంకటరాముడు, అచ్చమ్మ, నంజుండప్ప, నూరమ్మ, లక్ష్మీదేవి, గంగాధర్, హబీబ్, సుకన్య, నాగమ్మ, శోభ, గంగమ్మ, రామాంజనమ్మ పాల్గొన్నారు.

సిపిఎం కాలనీ వాసులతో మాట్లాడుతున్న తహశీల్దార్

104 వైద్య సేవలు తనిఖీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి పిహెచ్‌సి పరిధిలోని మార్లపల్లి గ్రామంలో నిర్వహించే 104 వైద్య సేవలను శనివారం డిఎంహెచ్ఒ డాక్టర్ ఫిరోజ్‌బేగం తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, కనీసం నడవలేని వారికి అందించే సేవలు, గ్రామస్తులకు అందించే వైద్య సేవలు, ఉచిత వైద్య పరీక్షలు, మందులు, ఆరోగ్య మిత్ర సేవల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్య వంతమైన జీవనం సాగించా లన్నారు. రోజూ వ్యాయామం, యోగా చేయాలన్నారు. సీజనల్, అసంక్రమిత వ్యాధులు, వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే ఆసుపత్రికి తీసకెళ్లాలని సూచించారు. మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను పర్యవేక్షిం చారు. వైద్యాధికారులు, సూపర్‌వైజర్, స్టాఫ్ రోజు వారీ కార్యక్రమాలపై ఆరా తీశారు. ఆమె వెంట వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ, చంద్ర కళ, ఆరోగ్య కార్యాకర్తలు శివ, రాధమ్మ, ఆశా కార్యకర్తలు సునంద, రత్నమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.



గర్భిణులకు సూచనలు చేస్తున్న డిఎంహెచ్ఒ

సికె.నాగేంద్రబాబు మృతి ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లా ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో క్రియాశీలకంగా వ్యవహరించడంతో పాటు, రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సికె.నాగేంద్ర బాబు మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. వారు శనివారం నాగేంద్రప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ సందేశాన్ని శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. నాగేంద్రబాబు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఉపాధ్యాయుల సంక్షేమానికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల్లో సామాజిక దృక్పథం, అభ్యుదయ భావజాలం పెంచడానికి పాటుపడ్డారన్నారు. ప్రజాసంఘాల ఉద్యమాలకు పూర్తి సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. ఆయన మృతి పట్ల యుటిఎఫ్ రాష్ట్ర సంఘం ప్రగాఢ సంతాపం తెలియజేస్తుందన్నారు. అలాగే వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నామని తెలిపారు.

నాగేంద్రబాబు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రతిభావంత గిరిజన విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ఐదుగురు గిరిజన విద్యార్థులను శనివారం హార్ట్ టు హార్టబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని చవిటితండాకు చెందిన వెంకటేష్ నాయక్ సమక్షంలో సన్మానించారు. ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవినాయక్ మాట్లాడుతూ గిరిజన తండాల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కొన్నేళ్లుగా సన్మానించి ప్రోత్సహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది ఐదుగురికి రూ. 2వేల చొప్పున రూ. 10వేలు అందజేశామన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఉన్నత చదువుల కోసం ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు నర్సినాయక్, భాస్కర్‌నాయక్, రమేష్‌నాయక్, బాలాజీనాయక్, వేమన్ననాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానిస్తున్న ట్రస్టు అధ్యక్షులు మూడే రవినాయక్

29న అంబేద్కర్ సేవా పురస్కారాలు

అగళి : మడకశిర పట్టణంలో ఈ నెల 29వ తేదీ నిర్వహిస్తున్న 'అంబేద్కర్ సేవా పురస్కారాలు' ప్రదానోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్.హనుమంతు హనుమంతు కోరారు. ఈ మేరకు శనివారం అగళిలో దళిత నాయకులతో నిర్వహించిన సమావేశంలో కరపత్రాలు విడుదల చేశారు. హనుమంతు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసిన, సమాజ సేవ చేస్తున్న వారిని గుర్తించి ఈ నెల 29వ తేదీ మడకశిరలో అంబేద్కర్ సేవా పురస్కారం ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండలం లోని దళిత, బహుజన నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎం.శ్రీనివాస్, ఎంఎస్.రఘునాథ్, మఠం లక్ష్మీనారాయణ, రవి, కాంతరాజు, కిట్టి, నాగోజీ, హనుమంతరాయుప్ప, మారుతి పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హనుమంతు, తదితరులు

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మండలంలోని అమగొండపాళ్యెం గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహిం చారు. ముఖ్యఅతిథులుగా తహశీల్దార్ కళ్యాణ్, ఎస్ఐ లింగన్న హాజరై మాట్లాడారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి, ఆలయాల్లోకి రానివ్వకపోవడం, రెవెన్యూ ఇతర సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికపై ఆరా తీశారు. పంట పొలాలకు వెళ్లడానికి దారి లేదని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ పౌర హక్కుల గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అడవి జంతువులను హింసించకూడదన్నారు. డివిజినల్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆంజనేయులు ఎస్సీ, ఎస్టీలు పిల్లలను బాగా చదివించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ గురించి వివరించారు. కార్యక్రమంలో డివిఎంసి సభ్యులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, ప్రజలు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్‌టిసి ఈయూ రాష్ట్ర కార్యదర్శిగా నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న కెవి.నాగార్జునరెడ్డి ఆర్‌టిసి ఉద్యోగుల ఎంప్లా యీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 25వ తేదీ స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు నాగార్జునరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు పాలిసెట్టి దామోదర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి.నరసయ్య, రాష్ట్ర కమిటీ, జోనల్ అండ్ రీజినల్ కమిటీలు, ఆరు డిపోల డిపో కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని, అందరికీ అన్నివేళలా అందుబాటులో ఉంటానన్నారు. నాగార్జునరెడ్డికి ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు.

మే డేను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-పెనుకొండ

కార్మికులు రక్తాన్ని చిందించి పోరాటాలు చేసి సాధించుకున్న హక్కుల ఫలితమే మే డే అని, మే డేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. పట్టణం లోని సాంఘిక సంక్షేమ హాస్టల్ ఆవరణలో శనివారం సిఐటియు ఆధ్వర్యంలో బావమ్మ, బాబావలి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిఐటియు కార్మికులకు అండగా నిలుస్తోందన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఎల్లప్పుడూ పోరాటాలు చేస్తుందన్నారు. సమావేశంలో సిఐటియు కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, బాబావలి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిఐటియు నాయకులు మహబూబ్‌బాషా, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు జయమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు తులసి, రాజేశ్వరి, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్

జీమా రంగంలో విదేశీ పెట్టుబడులు వద్దు

ప్రజాశక్తి-కదిరిటౌన్

సతీష్

ప్రభుత్వ బీమా రంగంలో విదేశీ పెట్టుబడులకు వ్యతిరేకంగా మే 20వ తేదీ చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు పి.సతీష్ పిలుపునిచ్చారు. ఆ సంఘం కడప డివిజన్ ఉపాధ్యక్షులు సూరిబాబు అధ్యక్షతన శనివారం పట్టణంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సతీష్ మాట్లాడుతూ ఐఆర్‌డిఎ సంస్థ ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అనుకూలంగా పని చేస్తూ ఎల్ఐసిని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఎల్ఐసి ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, నాయకులు అక్బర్‌బాషా, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కండి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాటాలు చేస్తూ, ప్రజల పక్షాన ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్, బ్యాళ్ల అంజి తెలిపారు. పార్టీ పిలుపుమేరకు శనివారం వారు మండలంలోని అమగొండపాళ్యెం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లా డుతూ హనుమకొండపాలెం ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులో లేవన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ఉపాధి లేక వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. కావున ప్రజలు చైతన్యమై ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో ఊపిరితిత్తులు, ఛాతి సంబంధిత జబ్బులకు ఉచిత వైద్య చికిత్సతో పాటు మందులు ఇస్తామని తెలిపారు.

అంగన్వాడీ ఆయా మృతికి నివాళి

ప్రజాశక్తి-రొద్దం

పెనుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తురకలాపట్నం సెక్టార్ పెద్దపల్లి గ్రామంలో అంగ న్వాడీ ఆయాగా పనిచేస్తున్న లక్ష్మీనరసమ్మ(58) శనివారం మృతి చెందింది. ఆమె కొంతకాలంగా అనా రోగ్యంతో బాధపడుతూ ఉండేది. ఆయా మృతి చెందిన విషయం తెలుసుకున్న అంగన్వాడీ కార్యకర్త త్రివేణి, సిడిపిఒ శాంతిలక్ష్మి, సూపర్‌వైజర్ సుజాతమ్మ, అనురాధ, పెనుకొండ ప్రాజెక్ట్ యూని యన్ అధ్యక్షురాలు జయమ్మ, కుర్లపల్లి అంగన్వాడీ టీచర్ సౌభాగ్యమ్మ ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సూపర్‌వైజర్ శాంతిలక్ష్మి మాట్లాడుతూ లక్ష్మీనరసమ్మ 34 ఏళ్లుగా పెద్దపల్లి గ్రామంలో అంగన్వాడీ ఆయాగా సేవలందించారని, ఆమె సేవలు మరువలేమన్నారు.

ఆయా మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సిడిపిఒ, సూపర్‌వైజర్

కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరుకు చెందిన అంగన్వాడీ కార్యకర్త పద్మావతి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, అంగన్వాడీ కార్యకర్తలు శనివారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. పద్మావతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శోభారాణి, పుణ్యవతి, శారద, అలివేలమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విధానాలను అనుసరించాలి : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-పెనుకొండ

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానాలను ప్రతిఒక్కరూ అనుసరించా లని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ మాధవన్ సూచించారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో శనివారం డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాధవన్ హాజరై మాట్లాడారు. అంబేద్కర్ దేశంలోని ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా ఆ ప్రజలకు మేలు జరిగేలా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఆ రాజ్యాంగం వల్ల సాధారణ వ్యక్తులు సైతం దేశ అత్యున్నత పదవులను అలంకరించారన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్య వర్గసభ్యులు రంగారావు, జిల్లా నాయకులు శ్రీనివాస్, జిఎం.శేఖర్, గంగాధర్, సీనియర్ నాయకులు రామకృష్ణ, రామాంజ నేయులు, రవి, మమత, జిల్లా దళిత సంఘం నాయకులు మూర్తి, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, పెద్దన్న పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ నటరాజ్

కొత్తచెరువు ఎంపిడిఒగా నటరాజ్

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల ఎంపిడిఒగా నటరాజ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈవోఆర్‌డిగ

ఉగ్రదాడిపై నిరసన ..కొవ్వొత్తుల ప్రదర్శన

ధర్మవరంలో ముస్లిములు నిరసన ప్రదర్శన

నల్లమాడలో కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా శనివారం పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్స్ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఉగ్ర దాడి పిరికిపంద చర్య అన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వాన్ని కోరారు. డాక్యుమెంట్ రైటర్స్ సంఘం నాయకులు ముందుగా మౌనం పాటించి ఉగ్రవాదుల దాడిలో మృతులకు నివాళులర్పించారు. ఉన్మాదుల ఆట కట్టించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌బాషా, అల్లం రామంజి, మల్లికార్జున, బాలాజీ, గోపి, వాజీద్, జావెద్, భాస్కర్, మహేంద్ర, కీర్తి, నాగార్జున, పామిశెట్టి మల్లికార్జున, ధను, అనిల్, రామంజి, లేఖరుల సహాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జామియా మసీదుతో పాటు అన్ని మసీదు కమిటీల సభ్యులు జామియా మసీద్ వద్ద ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ పెద్దలు అబ్దుల్ ఖాదర్ షాబ్, సెక్రటరీ హైదర్‌వలి, అబు తాహిర్ మూలాన, నాగూర్ హుస్సేన్, ఎన్ ఫారూఖ్, అయూబ్ ఖాన్, నూర్‌మహమ్మద్, ఇమ్రాన్, మదార్‌వలి, టిప్పు సుల్తాన్ టీం హెచ్ షబ్బీర్, టీం యువకులు, ముస్లింలు పాల్గొన్నారు.

నల్లమాడ : ఉగ్రదాడిని ఖండిస్తూ నల్లమాడలో టిడిపి యువత ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతులకు సంతాపం తెలిపారు. దాడి చేసిన ముస్కురులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాలీలో డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కోట్లో మంజురెడ్డి, సతీష్‌కుమార్(సోను), పటాన్ బాబావలి, ఎస్.కేశవరెడ్డి, జి.దామోదర్, కేశవరెడ్డి, మైలే రామచంద్ర, కేశవ, అశోక్‌కుమార్, శంకర, హరి, ఈశ్వరయ్య, రవికుమార్, ప్రకాష్, రామయ్య, రవీంద్ర, డీలర్ శివారెడ్డి, అభి, సర్వేయర్ గంగాద్రి, అమర్, అగ్గిరాముడు, ఉద్దండం జనార్ధన, జనసేన మండల కన్వీనర్ మహేష్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ప్రజలు నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ కూడలి వరకూ శాంతిర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఇంతియాజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని నాయకులు పేర్కొన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ శనివారం సాయంత్రం హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సర్కిల్‌లో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో కెపి.అంజనప్ప నాయుడు, సమీవుల్లా, రామ్మోహన్, ఇంతియాజ్, నాగార్జున, గంగులప్ప, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య

సోమందేపల్లి : జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి పిరికిపంద చర్య అని ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంగాధర్ ఓ ప్రకటనలో విమర్శించారు. ఉగ్ర దాడిలో 26 మంది మృతిచెందడం, పలువురు క్షతగాత్రులు కావడం బాధాకరమన్నారు. ఆయా కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకుని అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటన కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కదిరిటౌన్

ఆర్‌డిటి సంస్థకు వచ్చే విదేశీ నిధులకు సంబంధించిన ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సిఆర్ఎ)ను కేంద్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాంప్రసాద్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థకి వచ్చే విదేశీ నిధులకు సంబంధించిన ఖాతాను సీజ్ చేయడంతో పేదలకు ఆ సంస్థ అందించే సేవలు ఆగిపోయాయన్నారు. కావున సిఎం చంద్రబాబు స్పందించి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎఫ్‌సిఆర్ఎ ను పునరుద్ధరణ చేయించాలని కోరారు. ఆయనతో పాటు దళిత, గిరిజనులు నాయకులు రామంజి, గోవిందు, రమేష్, నాగేంద్ర ఉన్నారు.

ఓబుళదేవరచెరువు : పేదల సంక్షేమం కోసమే పని చేస్తున్న ఆర్‌డిటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సిఆర్ఎ)ను పునరుద్ధరించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఐ నాయకులు తహశీల్దార్ అనంతాచారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆర్‌డిటి పేదరిక నిర్మూలన కోసం పాటుపడడంతో పాటు లక్షలాది మందికి నిరుపేదలకు గృహాలు నిర్మించిందన్నారు. సమాజ అభివృద్ధి కోసం మహిళలు, పిల్లలు, వికలాంగులు, దళిత, గిరిజన, అణగారిన వర్గాలకు ఆర్థికంగా చేయూతనిస్తుందన్నారు. విద్య, వైద్యం అందించి నిరుపేదలకు తోడుగా ఉందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధులను ఆపడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, చలపతి, రత్నబాయ్, రామచంద్ర, రమణ పాల్గొన్నారు.

తూముకుంట ఎక్సైజ్ చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, మద్యం అక్రమ రవాణా కేసులలో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను త్వరితగతిన క్లియర్ చేయాలన్నారు. కల్లు దుకాణల నుంచి కల్లు శాంపిల్స్ సేకరించి చిత్తూరు కెమికల్ ల్యాబ్‌కు పంపించాలన్నారు. అనంతరం హిందూపురం మండలం తూముకుంట చెక్ పోస్టును తనిఖీ నిర్వహించారు. అంతర్ రాష్ట్ర సరిహద్దులో నిఘాను కట్టుదిట్టంగా కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వివిధ పనులపై కార్యాలయం వద్దకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. అలాగే పశు, పక్షాదుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రమీలమ్మ, వన్నూరప్ప, రాజేష్, అంజి పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలి : ఎస్పీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోని ప్రజలు కలిసిమెలిసి ఎలాంటి కక్షలు కార్పణ్యాలకు తావులేకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్పీ వి.రత్న సూచించారు. మండలంలోని కేశాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ ముందుగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఫ్యాక్షన్ ప్రభావం వల్ల గొడవలకు పాల్పడితే జీవితాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. గ్రామాల్లో కక్షలు వీడి ప్రశాంతంగా జీవించాలన్నారు. పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. యువత డ్రగ్స్, గంజాయి వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనం నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మహిళలు, పిల్లలకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం శక్తి యాప్ ప్రవేశపెట్టిందని, ఈ యాప్ గురించి ప్రజలకు వివరించారు. గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కళాజాత బృందాలతో సమాజంలో జరుగుతున్న నేరాలపై పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు అనంతరం కళాజాత బృందాలను ఎస్పీ సన్మానించారు. సదస్సులో డీఎస్పీ విజయకుమార్, సిఐలు సురేష్, గోపీనాథ్‌రెడ్డి, ఎస్‌ఐలు లింగన్న, కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేశాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ వి.రత్న

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

అంజలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్‌లో ఉన్న ప్రధాన పౌరశాఖ గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకూ వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, డాన్స్, క్విజ్, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-నల్లచెరువు

టిబి, లెప్రసీ, ఎయిడ్స్ జిల్లా అధికారి డాక్టర్ తిప్పయ్య శనివారం స్థానిక పిహెచ్‌సిని సందర్శించి రికార్డులు, ల్యాబ్‌లు, అన్ని విభాగాలను పరిశీలించారు. రికార్డుల్లో కొన్ని సవరణలను సూచించారు. ఓ గర్భిణికి వైద్య పరీక్షలు సూచించారు. ఆయన వెంట డాక్టర్ కల్పన, సిహెచ్ఓ రామచంద్రారెడ్డి, పిహెచ్ఎన్ భారతి, సూపర్వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, స్టాఫ్ నర్స్, ఎఎన్ఎంలు, ఫార్మసీ ఆఫీసర్ చిన్నయ్యశెట్టి ఉన్నారు.

పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి : డిఆర్ఓ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పాలిసెట్-2025 పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఓ విజయసారథి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం పాలిసెట్ పరీక్షలపై సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ ధర్మవరం, కదిరి, హిందూపురం పాలిటెక్నిక్ కళాశాలల పరిధిలోని 15 కేంద్రాల్లో ఈ నెల 30వ తేదీ పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తారని, ఎక్కడా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల కోసం వైద్య శిబిరాలు, తాగునీరు, రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. పాలిసెట్ కోఆర్డినేటర్ జెవి. సురేష్‌బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5,326 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నా రన్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమావేశంలో డీఎస్పీ విజయ్‌కుమార్, డిఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం, కదిరి, హిందూపురం ప్రిన్సిపళ్లు రమ, హరీష్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ బాలస్వామి, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్, హిందూపురం తహశీల్దార్ మైముద్దీన్ పాల్గొన్నారు.

'ఉపాధి' పని దినాలు పెంచాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఉపాధి హామీ కూలీల సమస్యలపై శనివారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ ఆధ్వర్యం లో ఎంపిడిఓ నరసింహనాయుడుకి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఉపాధి కూలీ లకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ. 700 కూలి పడేలా చూడాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలని, మస్టర్‌లో అవక తవకలను నివా రించాలన్నారు. పని ప్రదేశంలో కూలీ మరణిస్తే రూ. లక్ష ఎక్స్‌గ్రేషియా, గాయపడితే వైద్య ఖర్చులు భరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండల వెంకటేష్, సన్నపెద్దన్న, బత్తల నాగభూషణ, రామాంజనేయులు, సత్యప్ప, రామకృష్ణ, సత్యమయ్య, సాకే నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.